కథా నిలయం
శ్రీకాకుళం

GUPTA CIRCULATING LIBRARY
33/3, SAMPIGE ROAD, MALLESWARAM
BANGALORE-3.

# పాతమనుషులు

పోస్టుమన్ ఇచ్చివెళ్ళిన కవరు చింపి ఉత్తరం చదువుకునేసరికి రంగారావు ముఖంలో వింతమార్పు కలిగింది. మొదట ఆ ఉత్తరం ఎవరు రాసిందీ అతడు పోల్చుకోలేక పోయాడు. కాని మరుక్షణంలోనే మరపు తెర విడిపోయింది. జ్ఞాపకాల అట్టడుగున పడి నలిగిపోయిన వృత్తాంతం గుర్తుకు వచ్చింది. ఆ ఉత్తరం తన జాబుకి జవాబే. కాని ఆ జవాబు రావటానికి రెండుసంవత్సరాల కాలం పట్టింది. ఒకప్పుడు ఆజవాబుకోసం కన్నులు కాయలు కాచేట్టు ఎదురు చూశాడు. కాని తీరని ఆశాభంగం కలిగింది. అంతేకాదు. భరించలేని అవమానం కలిగింది. కాని... కాని...... ఇప్పుడు ఆ జవాబు తనలో ఏ ఉత్సాహాన్నీ కలిగించటం లేదు. మీదుమిక్కిలి మరిచిపోయిన బాధల్ని రేపింది.

విశాలని తను ప్రేమించాడు. కనీసం, ఒకప్పుడు ఆమెని ఆరాధించాడు. తన అంతస్తుకీ ఆమె అంతస్తుకీ తేడా ఉండొచ్చు, కాని హృదయగతమైన బాంధవ్యం బాహ్యపరిస్థితులకి అతీతమని తను వూహించాడు. అందుకే ధైర్యంగా పరిస్థితిని ఆమెకు తెలియబరుస్తూ ఉత్తరం రాశాడు. తనని సహృదయతతో అర్థం చేసుకోవలసిందని ప్రార్థించాడు. ఆమె జవాబుమీదే తన భవిష్యత్తంతా ఆధారపడి ఉందని సూచించాడు. ఒకవేళ ఆమె అన్యథా భావిస్తే తనని క్షమించి ఆ విషయం మర్చిపోవలసిందని ప్రాధేయపడ్డాడు. వీటన్నిటికీ జవాబుగా ఆమె మౌనం ధరించింది. మౌనంలోని అనిశ్చిత పరిస్థితిని భరించలేక ముఖాముఖి మాట్లాడటానికి ఇంటికి వెడితే తనని ద్వారం దగ్గర చూసి ఆమె గబాలున తలుపు వేసుకుని లోపలికి వెళ్ళిపోయింది. తన ముఖంలో నెత్తురుచుక్క లేకుండా పోయింది ఆక్షణం. తను నిశ్చేష్టుడై పోయాడు. బరువుగా అడుగు వేసుకుంటూ వచ్చినదారినే వెళ్ళిపోయాడు. ఇంత కర్కశంగా అవమానకరంగా, ఆమె తనపట్ల ప్రవర్తిస్తుందని ఎంతమాత్రం ఊహించలేక పోయాడు. ఆమెతో తనకి కాలేజీలో చదివే రోజుల్నించీ పరిచయం ఉంది. తనతో ఎన్నోసార్లు ఆమె స్వేచ్ఛగా మాట్లాడింది. బూచిని చూచినట్లుగా అలా భయపడి పారిపోవలసిన అవసరం ఆమెకేమీలేదు. పోనీ అంతతో ఆగితే పరిస్థితి మరోవిధంగా ఉండేది. తను ఎన్నడూ ఊహించని విధంగా ఆమె ప్రవర్తించింది. ఆ సంఘటన ఇంకా తన కళ్ళకి కట్టినట్టుగా ఉంది...

భగ్నహృదయంతో ఆ ఉదయం తను ఆఫీసుకి వెళ్ళాడు. తను అదోవిధంగా ఉండటం చూసి మిత్రులంతా పరిహాసం చేయసాగారు. ప్రేమ వ్యవహారంలో పడి ప్రపంచం మర్చిపోయాడన్నారు. తను విశాలకి రాసిన ఉత్తరం విషయం వాళ్ళందరికీ ఎలాగో తెలిసిపోయింది. తన సాహసానికి వాళ్ళందరూ అబ్బురపడి తనని అభినందించారు. కాని తన మనసులోని తుఫాను సంగతి గ్రహించగల మిత్రుడు ఒక్కడూ లేడు.

తను పరధ్యానంగా ఏదో పని చేసుకొంటుంటే బంట్రోతు వచ్చి ఆఫీసరుగారు రమ్మంటున్నారని చెప్పాడు. తన గుండెల్లో రాయిపడ్డది. భయం భయంగా వెళ్లాడు. తనని చూసీచూడగానే ఉగ్రరూపం దాల్చి ఆఫీసరు "నేరం ఒప్పుకుంటున్నావా?" అని అరిచాడు. తనకి ఒక్కక్షణం మతి తప్పినట్టయింది. ధైర్యంచేసి హీనస్వరంతో అడిగాడు: "నేరమేమిటి సార్?"

"సిగ్గులేక నేరమేమిటో అడుగుతున్నావా? ఈ ఉత్తరం రాసిం దెవరు? నువ్వేనా?"

డ్రాయర్‌లోంచి ఓ ఉత్తరం తీసి తన కళ్ళమీదికి విసిరికొట్టాడు ఆఫీసరు. ఆ ఉత్తరం చూడగానే తన ప్రైప్రాణం పైనే పోయింది. ఎంతపని చేసింది విశాల! తనంటే ఆమెకిష్టం లేకపోవచ్చు. కాని అంత మూర్ఖంగా ప్రవర్తించాలా? తనతో ఒక్కమాట చెబితే సరిపోయేదిగదా! "ఏం మాట్లాడవేం?"

తను ఏమీ అనలేక తలూపాడు.

"నిన్ను డిస్మిస్ చేశాను, ఫో", అరిచాడు ఆఫీసర్.

తనకు కాళ్లు వణికాయి. ఉద్యోగం ఉంటేనే తనకి రోజు గడవదు. ఇక లేకపోతే దిక్కేమిటి?

"పైకి వస్తావు, బాగుపడతావు అనుకున్నాను. ఛీ—నీ ముఖం చూడటం పాపం. వెళ్ళిపో", అన్నాడు ఆఫీసరు. తనేదో చెప్పాలని నోరువిప్పాడు. నెమ్మదిగా అన్నాడు. "క్షమించండి, కాని నేను మనస్ఫూర్తిగా విశాలని ప్రేమించాను."

"షటప్. తాహ తెరిగి మాట్లాడు", అన్నాడు ఆఫీసరు.

నెమ్మదిగా బయటికి వచ్చాడు. తన తాహతు! పొరపాటే! ఆఫీసులో చేరింతర్వాత తన తాహతు మారిపోయింది! తను చెప్పేది వినటానికికూడ ఆయనకు వోపిక లేదు. నేరం మోపాడు. తన జవాబు వినే అవసరంకూడా లేదనుకున్నాడు. మాట అనగానే మండిపడ్డాడు. తన అంతస్తు తక్కువైతేమాత్రం తను మనిషికాడా? తనేం అపసవ్యంగా ప్రవర్తించలేదే! ఎంత అనాలోచితంగా అహంకారంగా మాట్లాడుతారు మనుషులు!

ఆఫీసులోకి వచ్చాడు తను. అందరూ తనని చూచి లేనిపోని సానుభూతి వెలిబుచ్చారు. అసలు తను అంత అనాలోచితంగా ఉత్తరం రాయకుండ ఉండాల్సిందని అన్నారు. ఆ రోజున అందరూ తనని అభినందించారు. ఈరోజున తనవల్ల తప్పు పడుతున్నారు. ఫలితాన్నిబట్టి చేసినపనుల్ని సమర్థించటమో దుయ్యబట్టటమో, వాళ్ళకలవాటు. కాని తన పద్ధతి అదికాదు. తను సరియైన మార్గం అనుకుంటే ఫలితం

ఏమైనా తప్పక అనుసరిస్తాడు. కనుక గతించినదానికి తను విచారించాల్సిన అవసరంలేదు. ఎటొచ్చీ మనుషుల మన స్తత్వాన్ని కొంత తెలుసుకో గలిగాడు. తను ఆఫీసు విడిచి బయటికి నడిచాడు. మనసంతా చికాకుగా వుంది. ఉద్యోగం పోయింది. అవమానానికి గురైనాడు. మనసు విరిగింది. కావాలనుకున్నది లభించలేదు. కాని అందుకోసం తను బాధ పడటం లేదు. ఆప్తులనుకున్నవాళ్లు విసిరి కసిరి కొట్టారు. అదీ మానని గాయం.

తను అలా కుంగిపోయిన మనసుతో నడుస్తుంటే, తనని ఎక్కడ చూశాడోకాని కొట్టులోంచి గబగబ పరుగెత్తు కొచ్చి నడిబజార్లో నిలేశాడు సుబ్బారావు. అతనికి తను వంద రూపాయలు బాకీ వున్నాడు. తను యిస్తానన్న గడువుకి ఇవ్వనిమాట నిజమే. అయినా అంత అసభ్యంగా అతడు ప్రవర్తిస్తాడనుకోలేదు. తప్పకవచ్చే నెల తీరుస్తాననిమాటిచ్చినా అతడు వినలేదు. పైగా ఆమాట అనగానే అతడు వెకిలిగా నవ్వి ఎగతాళిగా అన్నాడు. "ఉద్యోగం ఉన్నప్పుడు లేదు గానీ, ఉద్యోగం పోయింతర్వాత తీరుస్తావులేవయ్యా మహా!"

ఆ మాటల్లోని చులకనతో కూడిన అవమానంకంటె ఎక్కువగా ఆశ్చర్యం వేసింది. తనకి తన ఉద్యోగం పోయిం దన్న విషయం అప్పుడే సుబ్బారావు కెలా తెలిసింది ?

"ఆ విషయం మీ కెలా తెలిసింది ?" అని, అడిగాడు తను.

"ఏ విషయం ?"

"అదే. ఉద్యోగం పోయిందన్న విషయం."

"మీ తోటి ఆఫీసు గుమస్తాలు పొద్దున్నే అనుకున్నారు. హెడ్ గుమస్తాగారు చెప్పారట. ఆఫీసరుగా రమ్మాయితో మీ రేదో వ్యవహారం జరపబోతే ఆయన తెలుసుకుని డిస్మిస్ చేసేస్తానని పొద్దున ధాం ధూం చేశారట. పనిమీద హెడ్ గుమాస్తాగారు ఆఫీసరుగారింటికి వెడితే ఆయనతో యీ విషయం అంతా చెప్పారట. నేను పనిమీద మీ ఆఫీసుకు ఇంతకిముందే వెడితే, సంగతి తెలిసింది. అవునుగానీ అదేంపనయ్యా. ఏదో పెద్దమనిషివని అనుకున్నాను గాని ఆఫీసరుగారి కోటలోనే పాగా వేసే ఘనుడివని అనుకోలేదే!"

గుక్క తిప్పకుండ సుబ్బారావు అలా చెబుతుంటే తను దిగ్భ్రాంతుడయాడు. అయితే, తన మిత్రులందరికీ యీ విషయం తనకంటే ముందే తెలిసిందన్నమాట. అయితే వాళ్ళన్న మాటలన్నీ తనని అపహాస్యం చేయటానికే నన్న మాట. తను తెలుసుకోలేకపోయాడు. స్నేహితు లను కున్నాడుగానీ ఇంతదౌర్భాగ్యులనుకోలేదు. తను కష్టంలో వుంటే వాళ్ళకి చెరలాటంగా ఉంది! తనేదో ఘనకార్యం చేశాడని తన భుజం తట్టారు. ఆఫీసరుమీద వాళ్ళందరికి అంతో ఇంతో కోపంవుంది. బహుశా తనని ప్రశంసించటం తనేదో ఆయన్ని అపఖ్యాతిపాలు చేశాడనే తృప్తితో కాబోలు. వాళ్ళలో కొందరికైనా తనమీద కూడా కోపం వుంది. తనమీద ఆఫీసరుకి ఏదో కొంత అభిమానం ఉందని ఈర్ష్య! ఇప్పుడు తనూ, ఆయనా ఇద్దరూ అవమానించ బడ్డారనే తృప్తితో అక్కసు తీరేట్టు వ్యంగ్యంగా తనతో ప్రసంగించారు! ఎటువంటి కపట మనస్తత్వం.

అంతా ఆలోచిస్తుంటే తనకి విరక్తి కలిగింది. తనేదో ఆలోచిస్తుంటే సుబ్బారావు భుజం తట్టాడు.

"బాకీ సంగతి ఏం చెప్పావయ్యా?"

బాకీ! ఎలా తీర్చగలడు తను! అతడు నడిబజార్లో అలా అడుగుతుంటే తనకి చిన్నతనం వేసింది. తన ఉద్యోగం పోయిందని తెలిసినా, నిర్దయగా, ఎలా తీరుస్తావని అడుగుతున్నాడు. కాని కొన్నాళ్ళు గడువిస్తానులెమ్మని మాటైనా అనలేదు. అసహ్యం వేసింది. చేతికివున్న రిస్టువాచి తీసి సుబ్బారావు చేతిలో పడేసి అడుగు ముందుకి వేశాడు తను. లోపల సంతోషించినా ఏదో మొహమాటపడట్టు "అబ్బెబ్బె.. రిస్టువాచి ఎందుకూ?" అని గొణుగుతూనే జేబులో వేసుకున్నాడు సుబ్బారావు. ఎందుకో పైపై మర్యాదలు!

కష్టాలు ప్రారంభమయ్యాయి. పొద్దుటినుంచి తిండి తినలేదు. జేబులో డబ్బులేదు. అయినా ధైర్యం విడువక ఊరంతా ఉద్యోగంకోసం తిరిగాడు. కాళ్ళు బలపాలు కట్టాయి... ఆకలి దహించసాగింది. పచ్చిమంచినీళ్ళతో కడుపునింపుకున్నాడు. ప్రపంచంలోని కుళ్ళునీ, స్వార్థాన్నీ, దయారాహిత్యాన్నీ, పశుత్వాన్నీ, ఆ ఒక్కరోజులో పూర్తిగా చూశాడు తను. ప్రపంచంలో మానవత్వం ఏమూల దాగిందో నని ఆశ్చర్యపోయాడు. అంతకుముందున్న ఆశావాదం అంతా అణగారి పోయింది. తన మనుషులు, తన ఊరు, తన దేశం, తన ప్రపంచం అనేభావాలన్నీ తారుమారై పోయాయి. తీరని ద్వేషం ప్రబలింది. అందరూ కలకలలాడుతూ ఊరంతా సందడిగాఉంటే తను ఒక మారుమూల

దౌర్భాగ్యస్థితిలో ఆకలితో మాడుతూ మంచినీళ్ళతో కడుపు నింపుకుంటూ దుర్భరజీవితం గడపవలసి వచ్చింది. తోటి మనుషులవలె ఎవరికీ తనసంగతి పట్టలేదు. చిన్నమొత్తం సహాయం చేసినవాడులేడు. చిరునవ్వు చిందులాడే వయస్సులో ఎటుచూసినా ఏదో ఉద్రేకం కలిగేది తనకి. తనజీవితాన్ని అందరూ కలిసి దోచుకుంటున్నారు.

అయితే, బళ్ళు ఓడలూ, ఓడలు బళ్ళూ కాకపోవు. ఆ రోజు ఉదయం తన జీవితానికి శుభోదయం. ఆనాటి శుభఘడియలో పోస్టుమేన్ అందించిన ఉత్తరం తన దుర్భరజీవితానికి స్వస్తిచెప్పింది. స్వగ్రామంలోని భూముల్లో మైకా గనులున్నాయని భూగర్భశాస్త్రజ్ఞులు కనుగొన్నారట. ఎందుకూ పనికిరాదని వదిలివేసిన తన నాలుగ్గెకరాల బీడుకి మంచి గిరాకీ తగిలింది. ఆ స్థలం అమ్మాలని తను విశ్వప్రయత్నం చేశాడు. సాధ్యం కాలేదు. ఎందుకూ పనికిరాని చవిటిపర్ర అని ఎవరూ కొనటానికిరాలేదు. అదృష్టవంతుడే తను. దమ్మిడీ ఆదాయంలేని భూమి వేల ఖరీదు చేసింది! అప్పటినుంచీ తనదశ మారిపోయింది. అందరూ తనని అభినందించినవారే. తన ఉనికి అప్పుడుగానీ ఎవరికీ గుర్తులేదు.

అంతేకాదు, ఓడలు బళ్ళుకూడా అయాయి. ఈవార్త తెలిసి తన గ్రామంలోని భూముల్ని చాలామంది పెద్ద ధర యిచ్చి కొన్నారు. అందులో తన పూర్వపు ఆఫీసరుగారు ఒకరు. పాపం, దురదృష్టవంతుడు. ఆయన కొన్న భూముల్లో గనులు లేకపోలేదుగానీ అవి లాభసాటికావట. త్రవ్వకం ఖర్చులు గిట్టవట. మనిషి కుంగిపోయాడు పాపం. ఉన్న

ఆస్తినంతా అమ్మేసి భూములు కొన్నాడు. చివరికి అవి ఎందుకూ కొరగానివని తెలుసుకున్నాడు. పెద్ద సంసారం కూడా. ఉద్యోగం వల్ల వచ్చే డబ్బుతో సంసారం గడపటమే కష్టం. అందులో సుఖజీవితానికి అలవాటుపడ్డ జీవులు. పై అంతస్తులో మెలిగినవాళ్లు.

వ్యంగ్యపూరితమైన మందహాసం రంగారావు పెదవులమీద తాండవించింది. ఉత్తరం మళ్ళీ ఒకసారి చూశాడు. ఒక్కక్షణం విశాలమీద జాలికలిగింది. ఎంత అభిజాత్యం!

"మీకు వ్రాసిన ఉత్తరం జ్ఞాపకం ఉందనుకుంటాను. అప్పుడు అపార్థం చేసుకుని మీ మనసుకి కష్టం కలిగించాను. క్షమించండి."

రెండే వాక్యాలు. ఎంత అభిమానం! ఓడిపోయినా పైమెట్టుమీదే ఉండాలి కాబోలు. నోరువిడిచి చెబితే స్వాభిమానం దెబ్బతింటుంది కాబోలు. తను ఆమె భావం అర్థం చేసుకుని రెక్కలు కట్టుకొని ఆమె ముందు వాలాలి కాబోలు. ఈ ఆలోచన ఆనాడేమైందో! హు! తన మనసు విరిగింది. లాభంలేదు. పాపం, విశాల! ఏదో గొప్ప సంబంధం వస్తుందని ఆశపడి తనని కాలదన్నింది. ఇప్పుడు రెండో పెళ్ళి సంబంధాలు ఆలోచిస్తున్నారని తెలుసుకొని ఎంత ఆశాభంగం చెందిందో! ఆ మధ్య యీ విషయం గురించి తనతో ఎవరో అన్నారు. కాని తను అంతగా పట్టించుకోలేదు. ఈ రెండు సంవత్సరాల్లో ఆమెని దాదాపు

మర్చిపోయాడు తను. తనకెందుకు ఆమెని గురించి ఆలోచనలు? ఎలా రాసిపెట్టివుంటే అలాగే జరుగుతుంది.

రంగారావు ప్రశాంతతకోసం కళ్ళుమూసుకుని పడక కుర్చీలో పడుకున్నాడు. కాని మనసులో విశాలమూర్తి మెదిలింది. ఆమె దీనంగా వుంది. జీవితకాలం అంతటినీ శాసించే వివాహవిషయం సమస్యగా తయారై ఆందోళన కలిగిస్తున్నప్పుడు ఆమె ముఖభంగిమ ఎలా ఉంటుందో ఊహించుకున్నాడు. అతనికి జాలివేసింది. తను తలుచుకుంటే ఆ ఎర్రటి పెదవులమీద తాండవించే విషాదం తొలగించి చిరునవ్వులు చిందింపచేయగలడు! కానీ... చటుక్కున రంగారావుకి ఒక ఆలోచన కలిగింది. వెంటనే అతడు లేచి దుస్తులు వేసుకొని తను పూర్వం పనిచేసిన ఆఫీసుకి వెళ్లాడు. పాత మిత్రులు కనిపించారు. గౌరవం చేయబోయారు. ఈసడించుకున్నాడు. ముభావంగా సమాధానం చెప్పాడు. ఐనా వాళ్లు చిన్నబుచ్చుకున్నట్లు కనిపించలేదు. తనకి గర్వం డబ్బుతోబాటు పెరిగిపోయిందని లోపల తిట్టుకుంటూ అయినా తను డబ్బుకలవాడు కనుక, తనతో వాళ్ళకి ఎన్నో అవసరాలు ఉండొచ్చు. కనుక కోపాన్ని దిగమింగుకొని చిరునవ్వులు తెచ్చిపెట్టుకుని చనువుగా మాట్లాడుతున్నారు. అసహ్యం వేసింది రంగారావుకి. అతడు వెంటనే సరాసరి ఆఫీసరు దగ్గరికి వెళ్లాడు. రంగారావునిచూసి ఆయన కొంచెం ఆశ్చర్యపడి, తికమకపడి సర్దుకొని "ఏంకావాలి", అన్నాడు. రంగారావు ఆయనవైపు ఒకసారి చూసి ఏమీ అనకుండా, ఉత్తరంతీసి ఆయనకిచ్చాడు. ఇదేమీ అర్థంకాక, చేతిలోని

ఉత్తరంవైపు, రంగారావు వైపు చూచి ఆఫీసరు ఉత్తరం చదివాడు. ఆయన ముఖం ఎర్రబడ్డది. పెదవులు వణికాయి. అయినా ఏమీ తొణకకుండా అన్నాడు.

"ఏమిటిది ?"

"ఉత్తరం. ఎవరు రాశారో తెలుసనుకుంటాను. పరిస్థితికూడా మీకు తెలుసు," నెమ్మదిగా అన్నాడు రంగారావు.

ఆయన కొంచెంసేపు ఆలోచించి ఆవేశాన్ని అణచిపెట్టుకుని అన్నాడు. "ఐతే ఏమంటావు ?"

"ఆ రోజున నన్ను డిస్మిస్ చేశారు. ఈ రోజున విశాలని ఇంట్లోంచి వెళ్ళగొట్టేస్తారా ?"

వ్యంగ్యంగా నవ్వాడు రంగారావు. ఆఫీసరు ఏమీ అనలేదు. భరించలేని అవమానం అతని ముఖంలో ద్యోతకమైంది. రంగారావుకి ఇంక అక్కడ ఉండటానికి బుద్ధిపుట్టలేదు.

"సెలవు", అనేసి బయటికి వచ్చేశాడు...గుమాస్తాలు ఏదో గుసగుసలాడుకుంటున్నారు. వాళ్ళవైపు ఒకసారి నిర్లక్ష్యంగా చూసి ఆఫీసుదాటి వచ్చాడు రంగారావు.

ఇన్నాళ్ళకి తను మాటకి మాట చెప్పగలిగాడు. అవమానం ఎంత చేదుగా ఉంటుందో ఊహింప చేయగలిగాడు.! ఆఫీసర్ని యింకా దులిపేసేవాడే తను. కాని ఆయన ముఖంచూస్తే తనకి కొంచెం జాలివేసింది. మనిషి రెండు సంవత్సరాల్లో బాగా మారిపోయాడు. ముఖం ముడుతలు

పడిపోయింది. కష్టాలు మనిషిని ఎంత కుంగదీస్తాయో ఆయన ముఖం చూస్తేనే తెలుస్తోంది. పాపం, విశాల వివాహం అతనికో పెద్ద సమస్యగా తయారైనట్టు అతని వదనంలో దిగులు స్పష్టంగా కనిపించింది. తను వచ్చిన పని పూర పాటుగా అర్థం చేసుకొని ఉంటాడు. తను గతం మర్చిపోయి పరిస్థితుల్ని గమనించి సరిపెట్టుకుంటాడనుకున్నాడు కాబోలు ఒక్క క్షణం ఆశగా తనముఖంలోకి చూశాడు. కాని తను కసిరికొట్టేసరికి పాపం, చిన్నబుచ్చుకున్నాడు. తనకి కొంచెం జాలి వేసింది. ఆవదనంలోని నిరాశా నిస్పృహల్ని విచారాన్నీ తను ఒక్కమాటతో తుడిచివేయగలడు. ఒక్క మాట! అంతే, విషాద మేఘాచ్ఛాదితమైన ఆయన వదనం దరహాసచంద్రికల్ని ప్రసరింపచేయగలదు. అందుకు తను సమర్థుడు. కాని...కాని... తనహృదయం అర్థం కావటం లేదు. తన కష్టాలన్నిటికీ ఒక విధంగా ఆయన కారకుడు. తనెందుకు ఆయనపట్ల జాలి దలచాలి ?

ఆలోచిస్తూ నడవసాగాడు రంగారావు. అల్లంత దూరంలోనే అతనిని చూసి పరిగెత్తుకు వచ్చాడు సుబ్బా రావు. అది గమనించి చూసీచూడనట్టుగానే ఊరుకున్నాడు రంగారావు.

"రంగారావుగారూ దయుంచాలి", సుబ్బారావు ప్రాధేయపడసాగాడు.

విషాదంగా నవ్వాడు రంగారావు. దయ! ఇప్పుడు అందరూ తన దయకోసం పాకులాడుతున్నారు. ఒకప్పుడు అది తనకి అతి అపురూపమైంది.

"కొంచెం గడువిప్పించండి. అణా పైసలతో బాకీ తీర్చుకుంటాను."

గడువు! గడువు జీవితాలనే మార్చివేయగలదు. కాని తన కది పూర్వం అలభ్యమైంది.

"గడువు కావాలా?" అన్నాడు వెటకారంగా.

"చిత్తం", సుబ్బారావు వినయ విధేయతలు ఉట్టిపడేలా మీది కండువా రెండు కొనలూ పట్టుకొని చేతులు జోడించాడు.

ఆ పరిస్థితిని చూసి జాలిపడినా నవ్వాపుకోలేక పోయాడు రంగారావు.

"మీది కండువా లాక్కోను లేవయ్యా, భయ పడకు."

సుబ్బారావు ఆమాటలోని వ్యంగ్యాన్ని అర్థంచేసుకో లేకపోలేదు. ఒకప్పుడు రంగారావు తన వాచిని అతడు ఇంచు మించుగా జప్తుచేశాడు. పరిస్థితులు తర్వాత మారి పోయాయి. వ్యాపారంలో పెద్ద దెబ్బతిన్నాడు. గతిలేక రంగారావు దగ్గర అప్పు తీసుకున్నాడు.

ఇచ్చేటప్పుడు రంగారావు ఇలాంటి పరిస్థితికోసమే ఎదురు చూశాడు. తృప్తిగా నవ్వాడు రంగారావు. సమ యానికి తిరిగి ఇవ్వలేకపోవటంవల్ల రంగారావు నిస్సంకో చంగా దావాచేసి ఆస్తి జప్తుకుపెట్టాడు. రేపో మాపో జప్తు. ఉన్నట్టుండి గంభీరంగా ముఖం పెట్టాడు రంగారావు.

"ఏమైనా సరే, జప్తు ఆపటానికి వీల్లేదు. నేను ఖచ్చిత మైన మనిషిని."

సుబ్బారావు మ్లానవదనంతో నిరాశగా నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళిపోయాడు. పాపం తనలా అవమానిస్తాడని అనుకుని ఉండడు. ఇంత నిర్దాక్షిణ్యంగా తనెలా తయారయాడు! తనలో జాలి నశించి పోతోంది. సుబ్బారావు పరిస్థితికి, తనకు లోపల అసలు జాలిలేక పోలేదు. ఆయన విచారవదనం తనకు బాధ కలిగి స్తూనే ఉంది. తలుచుకుంటే ఆ విచారాన్నంతా తను పారదోల గలడు. ఒక్క మాటతో అతని పెదవులపై మందహాసాన్ని తాండవింప జేయగలడు. కాని తను జాలిదలచ వలసిన అవసరమేమిటి? ఎవరి ప్రవర్తన కనుగుణంగా వారు ఫలితాన్ని అనుభవిస్తుంటే మధ్య తనెందుకు జోక్యం కల్పించుకోవాలి?

ఆలోచనలతో రంగారావు మనసు వేడెక్కింది. అతనికి విసుగు పుట్టసాగింది. ఎవరెవరో వ్యక్తులు అతని మనోవీథిలో గోచరిస్తున్నారు. అందరూ ఏదో తనని అర్థిస్తున్నవారే! తన ఉనికి ఒకప్పుడు ఎవరికీ పట్టలేదు. కాని తను ఉచ్ఛస్థితిలో ఉండగానే అందరికీ తను కావలసివచ్చాడు. బీదవిద్యార్థులు, బీదకుటుంబీకులు, మిత్రులు, పరిచయస్థులు అందరూ తన ఆర్థిక సహాయం కోసం అర్రులు చాచారు. తనెవరికీ ఏ సహాయము చేయలేదు. తనకి సహాయం కావలసినప్పుడు ఎవరూ తనని ఆదుకోలేదు. ప్రపంచం తన గుండెని రాయిగా మార్చేసింది. తన అనుభూతులన్నీ నశించి పోయాయి. తనకి కావలసింది కేవలం తన స్వార్థం! అదే, ప్రపంచం తనకి నేర్పిన గుణపాఠం.

రంగారావు మనసులో ఏదో బాధ కలిగింది. జీవితమే నిస్సారమనిపించిం దతనికి. ఏం సాధించాలి ఈ ప్రపంచంలో? మనిషికీ మనిషికీ, మధ్యన ఇన్ని తెరలున్నప్పుడు హృదయానికి ఎలా దగ్గరికి రాగలుగుతుంది. అదే లేనినాడు జీవిత సాఫల్యమేమిటి? తన డబ్బు, తన సహాయం, అందరికీ కావాలి. కాని తనెవరికీ అక్కర్లేదు. తనకు కావాలని అనుకున్నవాళ్లు తనకు దక్కనేలేదు. విశాల రెండు సంవత్సరాల క్రితం తనని అర్థం చేసుకొని ఉంటే తన జీవితమే మరోవిధంగా ఉండేది. ఇప్పుడామె జీవితాన్ని చూసి భయపడి తనసహాయంకోరింది. అంతేకాని తను కావలసికాదు. ఈ నాటకంలో తనపాత్ర నిర్వహణాభారాన్ని వహించలేడు.

ఆలోచిస్తూ నడుస్తున్న రంగారావు ఎదురుగా వేగంగా వస్తున్న కారుని గమనించలేదు. తీరా దగ్గరకు వచ్చేసరికి తప్పుకోబోయాడు. కాని వెనకనుంచి మరొక కారు అలే హఠాత్తుగా వచ్చింది. ఒక్కక్షణం మాత్రం అతడు ఆలోచించి తప్పుకోటానికి వ్యవధివుంది. కాని ఆ పరిస్థితిలో అతనికి కాలూ చేయీ ఆడలేదు. విపరీతమైన భయం ఆవహించింది. మరుక్షణం అతని కళ్ళముందు కారుచక్రాలు గిరగిర తిరిగినట్టు కనిపించాయి. ఆ తర్వాత అతడు స్పృహలోలేడు. ప్రమాదం జరిగిపోయింది.

హాస్పిటల్‌లో రంగారావు బెడ్ దగ్గర డాక్టరూ నర్సు ఆదుర్దాగా రంగారావు పరిస్థితిని పరిశీలించసాగారు. కొన్ని గంటలు గడిచాయి.

డాక్టరు పెదవులమీద హాసరేఖ ప్రకాశించింది. రంగారావు నెమ్మదిగా కళ్లు విప్పాడు. వెంటనే గట్టిగా కళ్లు మూసుకున్నాడు. ప్రశాంతతని సూచించే అతని ముఖకళవళి కలు చప్పున మారాయి. ఏదో తీవ్రమైన భయాందోళనలు అతనిముఖంలో వ్యక్తం కాసాగాయి.

డాక్టర్ చిరునవ్వుతో రంగారావు భుజంతట్టాడు.

"భయంలేదు. ప్రమాదం దాటిపోయింది. కళ్లు తెరవండి."

రంగారావు వదనం మళ్ళీ ప్రశాంతమైంది. నెమ్మదిగా కళ్ళు విప్పాడు. ఎదురుగా డాక్టరు కనిపించాడు. పరిస్థితి అర్థం చేసుకుంటున్నట్టుగా డాక్టరువైపు పరకాయించి చూశాడు రంగారావు.

డాక్టరు చిరునవ్వు నవ్వాడు.

"దైవకృపవల్ల మీరు నాకు ఆశాభంగం కలిగించలేదు."

రంగారావుకు పరిస్థితి క్రమంగా తెలిసింది. డాక్టరు అన్నమాటలు పునరాలోచించుకోసాగాడు. ఆలోచిస్తూ డాక్టరువైపు చూడసాగాడు. ఎంత కులాసాగా, ఉత్సాహంగా చిరునవ్వుల వెన్నెలలు చిందిస్తూ మాట్లాడుతున్నాడు! మందస్వరంతో అడిగాడు.

"మీ పేరేమిటి డాక్టర్!"

"చంద్రశేఖర్."

పౌర్ణమినాటి చంద్రుడు జ్ఞాపకం వచ్చాడు రంగారావుకి.

"అలాగా, మీకు చాలా కృతజ్ఞుణ్ని డాక్టర్ చంద్రశేఖర్".

"నేను నిమిత్తమాత్రుణ్ణి. మృత్యువుతో హోరాహోరీగా పోట్లాడాను. మరి మీరు నాతో సహకరించబట్టే కదా నేను గెలిచాను."

మనస్ఫూర్తిగా హుషారుగా నవ్వాడు డాక్టరు.

తను సహకరించాడట! ఏమిటి తను సహకరించింది? నిస్సహాయుడై పడివుంటే డాక్టరు తన చాతుర్యంతో రక్షించాడు. చేతకాని డాక్టరైతే?

అయ్యో! అలాంటి ఒక డాక్టర్ వల్లే తన తల్లి అకాలమరణానికి గురయింది.

రంగారావుకి ఆ ఆలోచన భయం కలిగించింది. మరొక విధంగా జరిగివుంటే డాక్టరు యిలా నవ్వుతూ ఉత్సాహంగా మాట్లాడగలిగేవాడు కాడుకదా? అప్పుడాయన ముఖలక్షణాలు ఎలా ఉండేవి!

అకస్మాత్తుగా రంగారావు మనోవీధిలో ఎవరెవరో వ్యక్తులు గోచరించారు. అందరి వదనాల్లో ఏదో విషాదం, ఏదో బాధ, ఏదో నిస్పృహ. రంగారావు ఉల్లాసం హరించిపోయింది. బాధగా కళ్లుమూసుకున్నాడు. ఏవేవో పిచ్చి ఆలోచనలు అతని మనసుని ముసురుకున్నాయి. ఏవేవో దృశ్యాలు, ఒక పెద్ద నదీప్రవాహం – వరద – అందులో చిక్కుకుపోయిన మనుషులు. ఎవరో ఒడ్డున నిలబడి కేకవేస్తున్నాడు. అయ్యో! మునిగిపోతున్నాడు. తను చేతకానివాడు కాదు! నదిలో చప్పున దూకాలి ...

గబాలున లేవబోయాడు రంగారావు. కాని డాక్టరు పట్టుకొని అపాడు. ఒక్క క్షణం డాక్టరువైపు తేరిపారచూచి వికలమైన మనస్సును కుదుటపరచుకోటానికి ప్రయత్నించ సాగాడు రంగారావు.

"ఏమి టలా ఉలిక్కిపడి లేచారు?"

డాక్టరువైపు ఆదుర్దాగా చూస్తూ హీనస్వరంతో అడిగాడు రంగారావు.

"నేను తప్పక బ్రతుకుతానా డాక్టర్?"

"నిక్షేపంగా", అన్నాడు డాక్టర్ నవ్వుతూ.

రంగారావు వదనం ప్రశాంతమైంది.

"మంచిదేకాని మళ్ళీ పాతమనిషినిమాత్రం కాలేను, డాక్టర్."

"నేను హామీ యిస్తున్నాను. ఒక్క నెల రోజుల్లో కోలుకొని మళ్ళీ ఎప్పటిలాగే తిరుగుతారు."

రంగారావు భయంగా "వద్దు, వద్దు డాక్టర్ అలా అనకండి", అన్నాడు.

డాక్టర్‌కి ఇదేమీ అర్థంకాక రంగారావు వైపు ఆశ్చర్యంగా చూడసాగాడు.

"జరిగిపోయిన ప్రతిక్షణమూ పాతదేకదూ డాక్టర్? అలాగే మనుషులూ. ఒకే మనిషిలో ప్రతిక్షణమూ ఒక కొత్త మనిషిని గుర్తించటం అసంభవమా డాక్టర్?"

"అసంభవంకాదు." డాక్టర్ చిరునవ్వుతో అతని కళ్ళలోకిచూసి "మీకు విశ్రాంతి అవసరం. ఇంకేమీ

ఆలోచించకుండా నిద్రపొండి", అని అతని భుజంవరకూ దుప్పటలాగి అభయమిస్తున్నట్టుగా భుజం తట్టి వెళ్ళిపోయాడు.

రంగారావు కళ్ళుమూసుకున్నాడు. వెనువెంటనే కనురెప్పలమాటున దాక్కున్న మనుషు లెవరెవరో కనిపించారు.

ఒష్, వాళ్లు ఎవరోకాదు. రంగారావు పోల్చుకున్నాడు. తనెరిగిన పాతమనుషులే!

చేతకాని డాక్టర్! ఊతరాని మనిషి ఇంకా, ఇంకా..!